క్లుప్తంగా

చిరు వ్యాపారుల జీవనోపాధి మెరుగునకు కృషి



నెహ్రూనగర్: చిరు వ్యాపారుల జీవనోపాధి మెరుగునకు కావటి సుధీర్ నాయుడు ఫౌండేషన్ కృషి చేస్తుందని ఫౌండేషన్ అధ్యక్షుడు, నగర మేయర్ కావటి శివ నాగమనోహర్ నాయుడు పేర్కొన్నారు. సోమవారం 23వ డివిజన్ నగరంపాలెం మూడు బొమ్మల సెంటర్ వద్ద షేక్ హుస్సేన్‌కు ఫౌండేషన్ తరఫున తోపుడు బండి అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రోడ్ల వెంబడి చిరువ్యాపారం చేసుకొనే వారు రోజువారీ అద్దెలతో బండ్లు పెట్టుకొని ఇబ్బందులు పడుతున్నారని, అటువంటి వారికి కావటి సుధీర్ నాయుడు ఫౌండేషన్ ద్వారా తగిన తోడ్పాటు అందిస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు సాధు ఉమామహేశ్వరి, కంతేటి శ్యాం శేఖర్, ఖాజా మొహిద్దీన్, బోగిసం ప్రసాద్, సుభాని, షేక్ అబ్దుల్ జబ్బార్, ఇంతియాజ్, శ్రీనివాసరావు, కుంట హరిబాబు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయినికి సత్కారం



గుంటూరు ఎడ్యుకేషన్: తమ తండ్రి బొమ్మిడాల శ్రీ కోటిరత్నం పేరున ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలుగా పని చేస్తున్న కొత్త సునీత రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయురాలుగా పురస్కారం అందుకోవటం పాఠశాల కీర్తి ప్రతిష్టలు ఇనుమడింప చేసిందని, భవిష్యత్తులో ఉపాధ్యాయురాలు సునీత మరింతగా పేరు గడించాలని బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి పేర్కొన్నారు. గతవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలో రాష్ట్ర ప్రభుత్వంచే ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ప్రతిభా పురస్కారం అందుకున్న కొత్త సునీతను శ్రీకృష్ణమూర్తి, లక్ష్మీ అన్నపూర్ణమ్మ దంపతులు రింగ్ రోడ్డులోని తమ నివాసంలో అల్పాహార విందుతో పాటు శాలువా, జ్ఞాపిక తో ఘనంగా సత్కరించారు. పెండ్యాల ప్రతీష, అడపాల మురళీధర్, ఉపాధ్యాయులు మన్నవ సురేష్, జక్రియ అహ్మద్, కోట మురళీకృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధి దిశగా పరిశోధనలు చేపట్టాలి

లాంఫాం శాస్త్రవేత్తలతో ఎన్జీరంగా వర్సిటీ వీసీ సమావేశం

గుంటూరు రూరల్: రైతుల అభివృద్ధికి నూతన పరిశోధనలు చేపట్టాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మి తెలిపారు. సోమవారం నగర శివారులోని లాంఫాం వ్యవసాయ పరిశోధన కేంద్రానిన ఆమె సందర్శించారు. శాస్త్రవేత్తలు, బోధన, బోధనేతర సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సమన్వయంతో కృషి చేసి, విశ్వవిద్యాలయాన్ని ముందుకు తీసుకెళ్లే దిశగా పరిశోధనలు జరపాలని సూచించారు. తనపై నమ్మకంతో వీసీగా నియమించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బయో టెక్నాలజీ ల్యాబ్‌ను సందర్శించి, అక్కడ జరుగుతున్న పరిశోధనలను శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకున్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

ప్రత్తిపాడు: ప్రమాదాల నివారణకు పోలీసులు ఆర్ అండ్ బీ అధికారులతో కలిసి నివారణ చర్యలు చేపట్టారు. ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలకు ప్రత్తిపాడులోని గుంటూరు పర్చూరు పాత మద్రాసు రోడ్డుపై, పంచాయతీ కార్యాలయం ఎదురు ఆర్ అండ్ బీ రోడ్డుపై గుంతలు పడ్డాయి. దానికి తోడు టిప్పర్లు, భారీ వాహనాలు ఈ మార్గంలో అధికంగా తిరుగుతుండటంతో గుంతలు పెద్దవయ్యాయి. ఈ నేపథ్యంలో వాహనదారులు రాత్రి సమయాల్లో గుంతల వల్ల ప్రమాదాల బారిన పడుతున్నారు. దీంతో ప్రత్తిపాడు ఎస్‌ఐ డి. రవీంద్రబాబు గుంతలు పూడ్చించే సామాజిక బాధ్యతను తీసుకున్నారు. ఆర్ అండ్ బీ ఏఈతో మాట్లాడి సోమవారం రాత్రి మెయిన్ రోడ్డుపై పడిన గుంతలను దగ్గరుండి పూడ్చించారు. ప్రమాదాల నివారణకు తన వంతుగా చర్యలు తీసుకున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుంటూరు ఈస్ట్: గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మస్తానయ్య దర్గా సమీపంలో ఆదివారం గుర్తుతెలియని సుమారు 27 సంవత్సరాల వ్యక్తి మృతిచెంది ఉన్నాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఫొటోలోని వ్యక్తిని గుర్తించిన వారు 8688831336 నంబరుకు సంప్రదించాలన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- ప్రతి మూడో సోమవారం ఎంప్లాయీస్ గ్రీవెన్స్
- కమిషనర్ కీర్తి చేకూరి



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: ప్రతి నెల మూడో సోమవారం మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు ఎంప్లాయీస్ గ్రీవెన్స్ నిర్వహిస్తామని నగరపాలక సంస్థ ఉద్యోగులు తమ సర్వీస్‌కి సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం అర్జీలు అందించవచ్చని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో స్పందన నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థకు చెందిన వివిధ విభాగాల ఉద్యోగులకు సంబంధించిన సర్వీస్ సమస్యల పరిష్కారం కోసం ప్రతి నెల 3వ సోమవారం మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తామన్నారు. ప్రజల నుంచి జగనన్నకు చెబుదాం, స్పందనకు అందే ఫిర్యాదులను బాధ్యతతో పరిష్కరించాలన్నారు. ఫిర్యాదులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్‌ను ఆయా విభాగాధిపతులు పరిశీలించాలని, విభాగాల వారిగా జగనన్నకు చెబుదాం అర్జీల పరిష్కారానికై ప్రత్యేక సిబ్బందిని కేటాయించుకోవాలన్నారు. ఫిర్యాదుల పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియచేయాలన్నారు. సమస్య పరిష్కారానికి ముందు, తర్వాత ఫోటోలు జత చేయాలన్నారు. సచివాలయ కార్యదర్శులు విభాగాల వారిగా తమ సచివాలయం పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉండాలన్నారు. స్పందన అర్జీల అప్‌డేట్స్‌ని ప్రత్యేకంగా విభాగాధిపతులతో ఏర్పాటు చేసిన గ్రూప్‌లో పోస్ట్ చేసి, పరిష్కారాలపై సమీక్షా చేయాలని అదనపు కమిషనర్‌ని ఆదేశించారు. ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు జరిగే స్పందనలో కార్యదర్శులందరూ వార్డు సచివాలయాల్లో అందుబాటులో ఉండాలన్నారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 22 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 7, ఇంజనీరింగ్ విభాగానికి 7, రెవెన్యూ విభాగానికి 2, ప్రజారోగ్య విభాగానికి 4, ఉపా సెల్ విభాగానికి 1, అకౌంట్స్ విభాగానికి 1 చొప్పున ఫిర్యాదులు అందాయని, ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అదనపు కమిషనర్ పి.రోజా, డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాస్, ఎస్ఈ భాస్కర్, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంహెచ్ఓ డాక్టర్ భాను ప్రకాష్, బయాలజిస్ట్ మధుసూదన్, మేనేజర్ శివన్నారాయణ, ఉపా సెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ఏసీపీలు, ఈఈ లు, ఎస్‌ఎస్‌లు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

ఓటర్ల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి..

నెహ్రూనగర్: గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాల పరిధిలోని బీఎల్‌ఓలు ఫీల్డ్ వెరిఫికేషన్ చేసిన ఆయా ఫారాలను 2 రోజుల్లో ఆన్‌లైన్ చేయాలని, సూపర్వైజరీ అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పర్యవేక్షణ చేయాలని నగర కమిషనర్ కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్వో కీర్తి చేకూరి ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో ఏఈఆర్‌ఓలు, సూపర్వైజరీ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా బీఎల్‌ఓలు తమ పోలింగ్ స్టేషన్ల పరిధిలోని ఓటర్ల వెరిఫికేషన్ పూర్తి చేసిన ఫారాలు 2 రోజుల్లో ఆన్‌లైన్ చేయాలని, ఆన్‌లైన్ చేయడానికి నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ప్రత్యేకంగా డేటా ఎంట్రీ ఆపరేటర్లను కేటాయించామని, సూపర్వైజరీ అధికారులు ఫారాలు ఆన్‌లైన్‌లో నమోదు కార్యక్రమంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో పట్టణ ప్రణాళిక అధికారులతో కలిసి పరిశీలించి, ఎక్కడైనా పోలింగ్ కేంద్రాలు మార్పులు ఉంటే వెంటనే తెలియచేయాలన్నారు. ఎన్నికల విధులు కేటాయించబడిన సిబ్బంది ఎన్నికల సంఘం నుంచి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని, ఏదైనా కారణంగా సెలవులో ఉన్నప్పటికీ ఫోన్‌లో అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం నుంచి అందే మార్గదర్శకాలను ఎన్నికల విభాగం ఎప్పటికప్పుడు ఎన్నికల విభాగం వాట్సాప్ గ్రూప్‌లో పోస్ట్ చేయాలన్నారు. ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అనంతరం నగరంలో పారిశుద్ధ్య పనులపై సమీక్షించి, ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం జరగేలా పర్యవేక్షణ చేయాలని ఎంహెచ్‌ఓని, చెత్త తరలింపు వాహనాలు షెడ్యూల్ మేరకు అందుబాటులో ఉండేలా చూడాలని ఈఈని ఆదేశించారు. ఈ నెల 15లోపు జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా ప్రతి వలంటీర్ తమ పరిధిలోని ఇళ్లల్లో ప్రజల ఆరోగ్య సమస్యలపై సర్వే నిర్వహించి ఏఎన్‌ఎంకు ఇవ్వాలని, ఏఎన్‌ఎం 15వ తేదీ తరువాత అవసరమైన వారికి ప్రాథమిక పరీక్షలు చేసి, తదుపరి జరిగే మెడికల్ క్యాంప్‌లకు తీసుకువస్తుందన్నారు. పశ్చిమ నియోజకవర్గ ఈఆర్వో అదనపు కమిషనర్ పి.రోజా, డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాస్, ఎస్ఈ భాస్కర్, సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, సూపర్వైజరీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ పొందినవారెవ్వరో చెప్పాలి

గుంటూరు రూరల్: చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో 2.5 లక్షల మందికి వివిధ కోర్సులు నేర్పించినట్లు చెబుతున్నారని వారంతా ఎక్కడున్నారో చూపాలని ప్రత్తిపాడు ఏఎంసీ చైర్‌పర్సన్ మెట్టు రాజేశ్వరి అన్నారు. సోమవారం నల్లపాడు గ్రామంలోని తన నివాసంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. నిరుద్యోగుల పేరుతో వేల కోట్ల రూపాయలు తన ఖాతాలో వేసుకున్న పాపం చంద్రబాబును ఎన్నటికి వీడదన్నారు. 2.5 లక్షల మందికి వివిధ కోర్సుల్లో శిక్షణ ఇచ్చి, ఉపాధి చూపి ఉంటే కనీసం వారన్నా..చంద్రబాబుకు మద్దతు తెలిపేవారన్నారు. ఎవరూ ముందుకు రాలేదంటే చంద్రబాబు స్కాం ఏ స్థాయిలో జరిగిందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఇదేవిధంగా ఆయనపై ఉన్న 23 స్టేలను ఎత్తివేసి, ఆ కేసులన్నీ విచారించాలని డిమాండ్ చేశారు.

స్కూల్ గేమ్స్ ఎంపికలు వాయిదా

ప్రత్తిపాడు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 11, 12 తేదీల్లో జరగాల్సిన మండల స్థాయి క్రీడా ఎంపికలు వర్షం కారణంగా వాయిదా పడినట్లు మండల స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్ పి. డేవిడ్ రాజ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాలు తగ్గుముఖం పట్టి, మైదానం క్రీడలకు సిద్ధమైన తర్వాత ఎంపికలను తిరిగి నిర్వహిస్తామని పేర్కొన్నారు. మండలంలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పీఈటీలు, పీడీలు, క్రీడాకారులు విషయాన్ని గమనించాలని కోరారు. అదేవిధంగా 14, 15 తేదీల్లో జరగాల్సిన నియోజకవర్గ స్థాయి ఎంపికలు కూడా వాయిదా పడినట్లు పేర్కొన్నారు. మండల స్థాయి ఎంపికలు ముగిసిన వెంటనే నియోజకవర్గ స్థాయి ఎంపికలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. మరోసారి ఎంపికలు జరిగే తేదీలను ప్రకటిస్తామని డేవిడ్ రాజ్‌కుమార్ చెప్పారు.

వ్యాపారులకు వైఎస్సార్ సీపీ అండ

- దుకాణాలను బలవంతంగా మూయించిన టీడీపీ, జనసేన నేతలు
- తమకు అండగా నిలవాలని ఫోన్‌లో ఎమ్మెల్యే, మేయర్‌లను కోరిన వ్యాపారులు
- బ్రాడీపేట, అరండల్‌పేటల్లో పర్యటించి పలు దుకాణాలు తెరిపించిన నేతలు



బ్రాడీపేటలో దుకాణ యజమానులకు అండగా నిలుస్తున్న ఎమ్మెల్యే మద్దాళి గిరి, మేయర్ కావటి

గుంటూరు ఈస్ట్: ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, నగర మేయర్ కావటి శివ నాగమనోహర్ నాయుడులు టీడీపీ, జనసేన నాయకుల బెదిరింపులకు గురైన వ్యాపారస్తులకు సోమవారం అండగా నిలిచారు. వివరాల్లోకి వెళితే టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకు కోర్టు ఆదివారం రిమాండ్ విధించిన నేపథ్యంలో ఆపార్టీ బంద్‌కు పిలుపునిచ్చింది. అయితే గుంటూరులో వ్యాపారస్తులు బంద్ పిలుపును పట్టించుకోకుండా ఉదయం షాపులు తెరిచారు. దీంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు షాపుల వద్దకు వచ్చి బెదిరించి బలవంతంగా షాపులు మూయించే ప్రయత్నం చేశారు. బ్రాడీపేటలోని షాపు యజమానులు కొందరు ఈవిషయాన్ని ఎమ్మెల్యే మద్దాళిగి రిధర్‌కు, మేయర్ కావటి శివనాగమనోహర్ నాయుడుకు ఫోన్ చేసి చెప్పి తమకు అండగా నిలవాలని కోరారు. దీంతో ఎమ్మెల్యే, మేయర్ బ్రాడీపేట శంకర్‌విలాస్ సెంటర్‌కు చేరుకుని వ్యాపారులకు మద్దతుగా నిలిచారు. వారిని చూసిన అనేక మంది వ్యాపారులు షట్టర్లు తెరిచి వ్యాపారాలు కొనసాగించారు. ఎమ్మెల్యే, మేయర్ అక్కడి నుంచి లాడ్జిసెంటర్ వైపు నడుచుకుంటూ వెళుతూ మిగిలిన వారికి ధైర్యం చెప్పి షాపుల షట్టర్లు తెరిపించారు. ఎమ్మెల్యే, మేయర్‌లు అరండల్‌పేట పీఎస్ సమీపంలోకి చేరుకుని షాపులు తెరిపిస్తుండగా పోలీసు స్టేషన్‌లో ఉన్న జనసేన నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీకి వ్యతిరేకంగా పెద్దగా నినాదాలు చేశారు. జనసేన నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే, మేయర్ వర్గం వద్దకు వచ్చి వాదులాటకు దిగారు. దీంతో పరస్పరం కొంత తోపులాట చోటు చేసుకుంది. అక్కడ తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. పోలీసులు రంగంలోకి దిగి ఇరువర్గాలను పక్కకు లాగి సర్దిచెప్పారు. అనంతరం ఎమ్మెల్యే, మేయర్ ముందుకు వెళ్లి వ్యాపారస్తులకు తమ మద్దతును కొనసాగించారు.

సామాన్యులపై దౌర్జన్యాలు సహించం..

ఈసందర్భంగా ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ టీడీపీ, జనసేన నాయకులు బంద్‌ను ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించాలన్నారు. అంతేకాని దౌర్జన్యం చేసి షాపులు పగులగొడతామంటూ బెదిరించి బంద్‌ను జరపడం సహించమన్నారు. సామాన్యులు, వాపారులపై దౌర్జన్యం చేస్తే తామూ చూస్తూ ఊరుకోమన్నారు. వైఎస్సార్ సీపీ ఎప్పుడూ సామాన్యుల పక్షాన నిలబడుతుందన్నారు. టీడీపీ, జనసేన నాయకుల బంద్ పిలుపును వ్యాపారులు, ప్రజలు తిరస్కరించారన్నారు. అయితే బలవంతంగా బంద్‌ను విజయవంతం చేయాలని ప్రయత్నించడం అప్రజాస్వామిక మన్నారు. బంద్ పూర్తిగా విఫలమైందని స్పష్టం చేశారు. చంద్రబాబు దోషి అని కోర్టులో రుజువు అయిన కారణంగా జైలుకు వెళ్లాడరన్నారు. బంద్‌పేరుతో వ్యవస్థను అస్తవ్యస్తం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

అవినీతిపరుడికి మద్దతు ఇవ్వడం సిగ్గుచేటు..

మేయర్ కావటి శివనాగ మనోహన్‌నాయుడు మాట్లాడుతూ టీడీపీ, జనసేన గుండాలు వ్యాపారులు, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. కోట్ల రూపాయలు దండుకున్న చంద్రబాబు దోషిగా తేలడంతో జైలుకు వెళ్లాడరన్నారు. అటువంటి వ్యక్తికి జనసేన పార్టీ మద్దతు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు నాయుడుకు పవన్ కళ్యాణ్ అమ్ముడుపోయాడనడానికి ఇది ప్రత్యక్ష నిదర్శనమన్నారు. పవన్ కళ్యాణ్ కాపు కులాన్ని చంద్రబాబు కాళ్ల వద్ద తాకట్టు పెట్టాలని చూడడం నీతిమాలిన చర్య అన్నారు. ముద్రగడ పద్మనాభం కుటుంబంపై దాడి జరిగినప్పుడు ఆయన ఆమరణ నిరాహార దీక్ష చేసినప్పుడు పవన్ కళ్యాణ్ ఎక్కడకు వెళ్లాడని ప్రశ్నించారు. అవినీతి సామ్రాట్ అయిన చంద్రబాబు కోసం పవన్ కళ్యాణ్ నేల మీద పడుకొని నిరసన తెలియజేయడం చూసిన ప్రజలందరూ విస్తుపోయారన్నారు. చంద్రబాబు కుమారుడు లోకేష్ కూర్చొని నిరసన తెలిపితే పవన్ కళ్యాణ్ నేల మీద పడుకొని నిరసన తెలపడంలో చంద్రబాబుపై దత్తపుత్రుడికి ఉన్న భక్తిశ్రద్ధలు తెలియజేస్తున్నాయన్నారు. పెద్ద సంఖ్యలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఐకమత్యంతోనే సమస్యలకు పరిష్కారం



కార్యవర్గ సభ్యులతో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు అనంత మల్లిఖార్జున, వీరాంజనేయ ప్రసాద్

గుంటూరు ఎడ్యుకేషన్: కళాత్మక నైపుణ్యంతో కూడిన చేనేత సంఘీయులుగా పేరు గడించిన తొగట వీర క్షత్రియులు మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యను ఆయుధంగా చేసుకుని, ఐకమత్యంతో సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని శ్రీ చౌడేశ్వరి తొగట వీర క్షత్రియ సేవా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మోడెం వీరాంజనేయప్రసాద్ పేర్కొన్నారు. శ్రీ చౌడేశ్వరి తోట వీర క్షత్రియ సేవా సంఘం 2023–25 సంవత్సరాలకు సంబంధించి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని బ్రాడీపేటలోని పెన్షనర్స్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నూతన అధ్యక్షుడు అనంత మల్లిఖార్జున మాట్లాడుతూ తొగట వీర క్షత్రియుల సామాజిక ఆర్థిక విద్యాపరమైన అభివృద్ధి కోసం జిల్లా నాయకత్వం పనిచేస్తోందని చెప్పారు. పేద విద్యార్థులకు కావలసిన విద్యాభివృద్ధికి అన్ని రకాల సహాయ, సహకారాలు అందజేస్తామని తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, నగదు పారితోషకాలు అందజేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మిశెట్టి కృష్ణమూర్తి, నూతన గౌరవాధ్యక్షుడు డాక్టర్ కుండా వెంకటేశ్వర్లు, వెనిగళ్ల కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు నీలం చలమయ్య, పోస చౌడేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వీర్నాల వెంకటేశ్వర్లు, కోశాధికారి కాల శ్రీనివాసరావు, ఉద్యోగ విభాగం గండిగ అంతోని, మహిళా నాయకులు ఎం.ఉషారాణి, పసల దివ్య పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే జాతీయస్థాయిలో గుర్తింపు



కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అధికారులు

నెహ్రూనగర్: నగర ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారుల సహకారంతోనే గుంటూరు నగరానికి జాతీయస్థాయిలో గుర్తింపు వచ్చిందని నగర కమిషనర్ కీర్తి చేకూరి అన్నారు. స్వచ్ఛ వాయు సర్వేక్షణ్‌లో గుంటూరు నగరానికి జాతీయ స్థాయిలో 3వ ర్యాంక్‌కు భోపాల్‌లో అవార్డ్ తీసుకున్న సందర్భంగా సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో కమిషనర్‌ను అదనపు కమిషనర్, డెప్యూటీ కమిషనర్లు, వివిధ విభాగాధిపతులు, కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు అభినందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛ వాయు సర్వేక్షణ్‌లో గుంటూరు నగరానికి జాతీయస్థాయిలో 3వ ర్యాంక్ వచ్చిందని, దక్షిణ భారతదేశంలో ఒక్క గుంటూరు నగరానికే అవార్డు రావడం ఎంతో గర్వకారణమన్నారు. అవార్డు రావడంలో నగర ప్రజలు, ప్రజా ప్రతినిధుల సహకారం, అధికారులు, సిబ్బంది కృషి కీలకమన్నారు. వార్డు సచివాలయాల వారీగా మొక్కల పెంపకంపై కార్యదర్శులకు కార్యాచరణ ప్రణాళిక కేటాయించామన్నారు. పారిశుద్ధ్య విభాగంలో ఇంటింటి చెత్త సేకరణకు ఈ–ఆటోలను అందుబాటులోకి తెచ్చామని, డివైడర్లు, సెంట్రల్ మీడియమ్స్‌లలో మొక్కల పెంపకం పెంచామన్నారు. కాలనీల్లో స్థానికంగా పార్క్‌లను ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేలా అభివృద్ధి చేశామన్నారు. త్వరలో నగరంలో స్థానికంగా ఉన్న నగరపాలక సంస్థ స్థలాల్లో మొక్కల పెంపకం, వాకింగ్ ట్రాక్‌ల అభివృద్ధి చేస్తామన్నారు.

చిరుధాన్యాల్లో పోషక విలువలు

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.అరుణ



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి. అరుణ

ప్రత్తిపాడు: చిరుధాన్యాల్లో అత్యధిక పోషక విలువలు ఉంటాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి. అరుణ అన్నారు. పోషణ మాసోత్సవాలలో భాగంగా సోమవారం గొట్టిపాడు సెక్టార్ పరిధిలోని పాతమల్లాయపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు, బాలింతలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. చిరుధాన్యాల ప్రాధాన్యతను వివరించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలవుతున్న ప్రీ–ప్రైమరీ విద్యపై అవగాహన కల్పించారు. పీపీ–1, పీపీ–2 పుస్తకాల గురించి చిన్నారుల తల్లులకు తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు బి.స్వాతి, వై.యమున పాల్గొన్నారు.
– ప్రత్తిపాడు సెక్టార్‌లోని ప్రత్తిపాడు వడ్డెరపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు ప్రత్యేక అవగాహన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అంగన్‌వాడీ కార్యకర్త నగరాజకుమారి తల్లులకు చిరుధాన్యాల ఆవశ్యకతను తెలిపారు. పెరటి తోటల పెంపకం, ప్రీ–స్కూల్లో చెప్పే కథలు.. అంగన్‌వాడీల ద్వారా అందిస్తున్న పోషకాహారం.. వంటి వాటి గురించి వివరించారు.

మహిళా సాధికారతకు కుట్టు శిక్షణ కేంద్రాలు

తాడేపల్లిరూరల్: సమాజంలో మహిళా సాధికారతకు కుట్టు శిక్షణా కేంద్రాలు ఉపయోగపడతాయని విజ్ఞాన కేంద్రాల రాష్ట్ర కన్వీనర్ పిన్నమనేని మురళీకృష్ణ అన్నారు. సోమవారం తాడేపల్లి బోసుబొమ్మ సెంటర్‌లోని మహిళా నైపుణ్య శిక్షణా కేంద్రంలో ఈనెల 15వ తేదీ నుంచి ప్రారంభం కానున్న మహిళా కుట్టు శిక్షణ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో మహిళలు ఆర్థికంగా నిలబడేందుకు కుట్టు మిషన్ శిక్షణ ఉపయోగపడుతుందని అన్నారు. ప్రస్తుతం కుట్టు మిషన్ శిక్షణ 90 రోజుల పాటు ఇస్తామని అన్నారు. భవిష్యత్తులో మగ్గం, ఎంబ్రాయిడింగ్, బ్యూటీషియన్, కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లీష్, గణితంలో మెలకువలు తదితర అంశాలపై శిక్షణ ఇస్తామని అన్నారు. మంగళగిరి, తాడేపల్లి బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి, చింతా వెంకటరత్నం మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి డిసెంబర్ 15 వరకు 90 రోజులపాటు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శిక్షణ ఇస్తామని అన్నారు. ఆసక్తి గలవారు మరిన్ని వివరాలకు 7993934411, 9866029486 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

భావితరాల భవిష్యత్ అధ్యాపకులదే



సుధీర్‌కుమార్‌ను అభినందిస్తున్న మనోహర్

గుంటూరు ఎడ్యుకేషన్: భావితరాల భవిష్యత్ అధ్యాపకుల చేతుల్లోనే ఉందని టీజేపీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ తెలిపారు. పట్టాభిపురంలోని కళాశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తెలుగు అధ్యాపకుడు డాక్టర్ జేవీ సుధీర్‌కుమార్, సంస్కృత అధ్యాపకుడు డాక్టర్ ఎ.అంజనీకుమార్ ఇటీవల ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సౌత్ ఇండియా ఐకానిక్ పురస్కారాలు అందుకున్నట్లు చెప్పారు. విధి నిర్వహణలో ఉత్తమ సేవలకు పురస్కారాన్ని అందుకోవడం ప్రతి అధ్యాపకుని జీవితంలో మరచిపోలేని రోజు అని, అధ్యాపకులు నిరంతర విద్యార్థులుగా ఉంటూ, విద్యార్థుల భవిష్యత్తును చక్కదిద్దాలని సూచించారు. కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం మాట్లాడుతూ ఈ ప్రపంచం క్రమ పద్ధతిలో వెళుతోందంటే, దానికి కారణం అధ్యాపకులేనని, భవిష్యత్ తరాల పునాదులు అధ్యాపకులేనని కొనియాడారు. మా కళాశాల అధ్యాపకులకు పురస్కారాలు రావడం ఎంతో సంతోషమని అధ్యాపకులను అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, జయ శైలజ, ఎం.విజయశ్రీ, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నారులకు వ్యాక్సిన్ తప్పనిసరి



ఫిరంగిపురంలో వ్యాక్సిన్ వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఫిరంగిపురం: మండలంలోని అన్ని గ్రామాల్లో మిషన్ ఇంద్రధనస్సులో భాగంగా గర్భిణులు, 0–5ఏళ్ల చిన్నారులకు వ్యాక్సిన్ వేసే కార్యక్రమం సోమ వారం ప్రారంభించినట్లు నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి ఫరీనా బేగం అన్నారు. ఆమె మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ఆరోగ్య సిబ్బంది వ్యాక్సిన్ వేయించుకోని వారి జాబితా తయారు చేసి వారికి ఇప్పటి నుంచి శనివారం వరకు వ్యాక్సిన్ వేస్తారని చెప్పారు. గర్భిణులకు టీడీ వ్యాక్సిన్, ఆరు, పది, పద్నాలుగు వారాల చిన్నారులకు రోటా, పెంటావాలెంట్, ఐపీవీ, ఓపీవీ, పీసీవీ వ్యాక్సిన్ వేస్తారని తెలిపారు. పదినెలల చిన్నారులకు ఎంఆర్, పీసీవీ బూస్టర్, ఐపీవీ బూస్టర్, విటమిన్ ఏ సెల్యూషన్ వేయనున్నట్లు చెప్పారు. ఫిరంగిపురం 1, 2 సచివాలయ పరిధిలో, మేరికపూడి, మునగపాడు గ్రామాల్లో ప్రస్తుతం వ్యాక్సిన్ వేస్తున్నారని మిగిలిన గ్రామాలకు విడతల వారీగా వ్యాక్సిన్ వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వోలు వెంకటలక్ష్మి, వెంకటరమణ, పీహెచ్‌ఎన్ గాయత్రీదేవి, హెచ్‌వీలు ఖాజాబీ, అన్నమేరి, ఎంఎల్ హెచ్‌పీ అమృత, మాబు, లావణ్య, పాపులమ్మ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

చదువుతోపాటు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న చలపతి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు

తాడికొండ: విద్యార్థులు చదువుతోపాటు సేవా దృక్పథాన్ని పెంపొందించుకోవడం ద్వారా సమాజంలో ఉన్నత భావాలు కలిగిన వ్యక్తులుగా తీర్చిదిద్దబడతారని మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె కిరణ్‌కుమార్ అన్నారు. కళాశాల ఈసీఈ విభాగం స్టూడెంట్స్ వింగ్ ఆధ్వర్యంలో సోమవారం గుంటూరు రవీంద్రనగర్‌లోని అనురాగ్ ఓల్డ్‌ఏజ్ అండ్ కేర్ సెంటర్‌ను సందర్శించి వృద్ధులకు అవసరమైన నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ జీవితంలో ఉన్నతంగా ఎదిగేందుకు సేవాగుణం ఎంతగానో ఉపయోగపడుతుందని, విద్యార్థి దశలో ఇలాంటి కార్యక్రమాలు భావి జీవితానికి ఉన్నత బాటలు వేస్తాయన్నారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె నాగశ్రీనివాసరావు, ఆర్ అండ్ డీ డీన్ డాక్టర్ పి బాలమురళీకృష్ణ, ఈసీఈ విభాగాధిపతి డి నాగ రవికిరణ్ పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.